క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన అంజిరెడ్డి



రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అంజిరెడ్డి

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటిలెక్చువల్ ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. అనంతరం అంజిరెడ్డి తనకు పదవి రావడానికి కృషి చేసిన సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని అంజిరెడ్డికి సుబ్బారెడ్డి సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన తాలుకా సీఐ, ఎస్సైలు

ఒంగోలు టౌన్: వివిధ సమస్యల మీద పోలీసు స్టేషన్‌కు వచ్చేవారి కోసం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తాలుకా సీఐ అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం తాలుకా పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం..

కొత్తపట్నం: కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ సూపరిండెంటెంట్ ఆఫ్ పోలీస్ జీబీఆర్ మధుసూదన్‌రావు, నార్త్ కోస్టల్ సబ్‌డివిజనల్ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వై గోవిందరావు పర్యవేక్షణలో కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. మెరైన్ సీఐ ఎస్ సాంబశివరావు చేతులతో రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సై పీ.సుబ్బారావు, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపట్నంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సాంబశివరావు

ముగిసిన పదో తరగతి పరీక్షలు



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు సెంటర్లలో మొత్తం 540 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మంగళవారం చివరి రోజు కావడంతో విద్యార్థులు పరీక్షలు పూర్తయిన అనంతరం స్నేహితులతో కలిసి హంగామా చేస్తూ ఇళ్లకు వెళ్లారు.

సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం వేధిస్తోంది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించడంలో గ్రామ, వార్డు సచివాలయాలు అత్యంత కీలక పాత్ర పోషించాయి. అంతేకాకుండా దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ పేరు మార్మోగిపోయింది. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం దిశగా వైఎస్సార్ సీపీ అడుగు ముందుకు వేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పేరును ఓర్వలేక కుట్రతో ఉద్యోగులను వేధించడం మొదలుపెట్టింది. ఇప్పటికే వలంటీర్లను తీసేసి.. ముసలి కన్నీరు కారుస్తోంది. తాజాగా సర్వేల పేరుతో ఉద్యోగులను విశ్రాంతి లేకుండా చాకిరి చేయిస్తూ వారిని మానసిక వేదనకు గురిచేస్తోంది.

సర్వే చేస్తారా.. లేదా !

- సర్వేల పేరుతో సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం
- సుమారు 12 రకాల సర్వేలు చేయిస్తున్న ప్రభుత్వం
- రెగ్యులర్ విధులు కూడా నిర్వహించాలని హుకుం
- ఓటీపీల విషయంలో ప్రజల అభ్యంతరం



మద్దులూరు సచివాలయం

సంతనూతలపాడు:

ప్రభుత్వం వివిధ సర్వేల పేరుతో గ్రామ సచివాలయ ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సుమారు 12 రకాల సర్వేలను చేయాలని.. చేయకపోతే శాఖ పరమైన చర్యలు ఉంటాయని పై అధికారులు బెదిరింపులు దిగడంతో ఒక పక్క సర్వేలు చేసుకుంటూ మరో పక్క రెగ్యులర్ విధులు నిర్వహించుకుంటూ ఒత్తిడికి గురవుతున్నారు. మండల పరిధిలోని స్వచ్ఛ సర్వేక్షణ్, సిటిజన్ ఫీడ్ బ్యాక్, వర్క్ ఫ్రం హోం సర్వే, పీ-4 సిటిజన్ కన్సల్టేషన్, పన్నుల వసూలు, పీజీఆర్ఎస్ ఈ-కేవైసీ, సిటీజన్ ఈ-కేవైసీ, హౌస్ హోల్డ్ డేటా ఇలా మొత్తం 12 రకాల పేరుతో సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక వేళ ఎవరైన అత్యవసర పరిస్థితుల్లో సర్వేలు చేయకపోతే వారిపై సస్పెన్షన్లు అని భయాభ్రాంతులకు గురిచేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పథకాలు తీసివేసేందుకేనా ?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యక్తిగత వివరాలు సేకరించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల కోత, కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడం, రేషన్ కార్డ్ ఈ–కేవైసీ పేరుతో ప్రజలకు ఇచ్చే ఆ పథకాలను తీసివేసేందుకు కుట్ర పన్నుతుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నలే.. ప్రశ్నలు

సచివాలయ సిబ్బంది క్లస్టర్ వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27 ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు చేస్తున్నారు. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయా అనే వివరాలు సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు.

ఓటీపీ చెప్పేందుకు ఇష్టపడడం లేదు..

అసలే బ్యాంక్ ఖాతాలో డబ్బులు కాజేసేందుకు ఎన్నో సైబర్ క్రైంలు జరుగుతున్న నేపథ్యంలో ఇలా మాటిమాటికి ఇళ్ల వద్దకు ఆధార్ చూపండి.. సెల్‌నకు ఓటీపీ వచ్చింది చెప్పమనడంతో తమ వ్యక్తిగత గోప్యతకు భద్రత లేకుండా పోయిందని ప్రజలు సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్నారు. దీంతో సర్వేలు పూర్తిస్థాయిలో చేయలేక సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతుంటే అధికారులేమో చెప్పిన సమయానికి సర్వే పూర్తి కావాలని గట్టిగా ఆదేశాలు ఇస్తున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉన్న సచివాలయాలు, ఉద్యోగుల సంఖ్య..

మండలం	సచివాలయాలు	పనిచేస్తున్న ఉద్యోగులు
మద్దిపాడు	18	145
నాగులుప్పలపాడు	20	160
చీమకుర్తి	25	102
సంతనూతలపాడు	15	115

కూటమి అరాచకాలను తిప్పికొట్టాలి



అల్లూరు గ్రామ కమిటీని ఎన్నుకున్న కార్యకర్తలు, నాయకులు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

అల్లూరు (కొత్తపట్నం): కూటమి చేస్తున్న అరాచకాలను తిప్పికొట్టడానికి గ్రామ కమిటీలన్నీ ఐక్యం కావాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో గ్రామ కమిటీల ముగింపు కార్యక్రమంలో భాగంగా అల్లూరు గ్రామంలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమానికి అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు, పార్టీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు మిట్నసల శాంతారావు అధ్యక్షత వహించాడు. అల్లూరు, గాదెపాలెం, అలూరు గ్రామాల్లో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డీలర్లు, మేట్లు, వీవోఏలు, చిన్న చిన్న ఉద్యోగులను తీసివేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పరిపాలన సాగిస్తే ఎవరనీ కూడా తీసేసిన సందర్భాలు లేవన్నారు. కార్యకర్తలందరికీ అండగా ఉండి ప్రతి సమస్యపై పోరాటం చేస్తామన్నారు. సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ 2029లో కచ్చితంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, స్వర్ణ శివారెడ్డి, ఈర్ల కోటేశ్వరరావు, రంగాయపాలెం సర్పంచ్ భర్త గాలి ముసలారెడ్డి, వేణు, కో ఆప్షన్ మెంబర్ జాజీ, వెంకటనారాయణ, మల్లికార్జున, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ రూల్స్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

కనిగిరిరూరల్: కేంద్ర ప్రభుత్వ పెన్షన్స్ రూల్స్ సవరణను పెన్షనర్ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని పెద్దిరెడ్డి, నరసింహారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పెన్షనర్ సవరణ బిల్లు ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర ప్రమాదకరమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం ఆమోదం పొందితే కోట్లాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. సవరణ బిల్లును తక్షణ ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ముక్కు వెంకటరెడ్డి, నాగభూషణం, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.మాలకొండారెడ్డి, గౌస్ మొహిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, యర్రారెడ్డి, కె. కృష్ణమూర్తి, కరీముల్లా పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల సంఘం సహాయ కార్యదర్శిగా పనిచేసి మృతి చెందిన ఎస్‌కే జైనులాబ్దిన్‌కు సంతాపం తెలిపారు.

ప్రమాదాల నివారణకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులను పర్యవేక్షిస్తున్న ఎస్సై

సంతనూతలపాడు: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారి గల స్పీడ్ బ్రేకర్లు వద్ద మరమ్మతుల కార్యక్రమం చేపట్టారు. ఇటీవల పోలీస్ స్టేషన్ తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్పీ దామోదర్ దెబ్బతిన్న రహదారులను పరిశీలించి ప్రమాదాల నివారణకు మరమ్మతులు చేయాలని ఎస్సై అజయ్ బాబును ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో ఎస్సై స్వచ్ఛందంగా ప్రమాదాల నివారణకు మంగళవారం ఎండ్లూరు డొంక వంతెన ప్రాంతంలో దెబ్బతిన్న రహదారిని సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న కనకారావు

సామాజిక సేవతోనే సంతృప్తి

నాగులుప్పలపాడు: సామాజిక సేవా కార్యక్రమాల ద్వారానే నిజమైన సంతృప్తి కలుగుతుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కొమ్మూరి కనకారావు అన్నారు. మంగళవారం ఈదుమూడి గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం కనకారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారానే స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల మనసుల్లో స్థానం సంపాదించారన్నారు. ఆయన బాటలోనే అందరం సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యడవల్లి మోహనరావు, కొమ్మూరి శేషయ్య, ఇస్రాయేలు, శింగయ్య, ముదవర్తి క్రాంతి, అశోక్, రాజేంద్ర, విజయ్ భాస్కర్ దావీదు తదితరులు ఉన్నారు.

వసంత నవరాత్రుల పూజలతో శుభాలు



శ్రీనివాసులు సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు, అర్చకులు

ఒంగోలు మెట్రో: వసంత నవరాత్రుల్లో పూజలు చేయడం వలన సమస్త శుభాలు కలుగుతాయని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఒంగోలు సంతపేట సాయిబాబా మందిరంలో వసంత నవరాత్రి మహోత్సవాలు భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈసందర్భంగా ఆయన వసంత నవరాత్రి వైభవంపై మాట్లాడుతూ ఉగాది ప్రారంభంలోనే అమ్మవారిని ప్రకృతి స్వరూపిణిగా భావించి అమ్మవారి ఆరాధన చేయడం వల్ల సమస్త శుభాలు కలుగుతాయన్నారు. దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల లాగానే తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రతిష్ఠించి అమ్మని వసంత నవరాత్రుల్లో కూడా ఆరాధన చేయాలని కోరారు. ముందుగా మందిరం అధ్యక్షుడు అళహరి చెంచలరావు, సెక్రటరీ కృష్ణమోహన్, ఓరుగంటి ప్రసాద్, శ్రీనివాసులును సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ర్యాలీగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం చీమకుర్తిలోని సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో చీమకుర్తి మున్సిపల్ కార్మికులు అంబేడ్కర్ నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తమ నిరసనలను తెలిపారు. సమ్మె ఒప్పందంలో భాగంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల సంఘం నాయకులు ఏడుకొండలు, పద్మ, కోటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

49 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 49 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 388 బేళ్లను తీసుకురాగా 339 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.250, సరాసరి ధర రూ.268.68 పలికింది. వేలంలో 12 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో గరిష్ఠ ధర రూ. 281 పలికింది. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 473 బేళ్లను తీసుకురాగా వాటిలో 406 బేళ్లను కొనుగోలు చేసి 67 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.240, సరాసరి రూ.266.56 పలికింది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



యువకులతో మాట్లాడుతున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: యువకులు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కట్టా అనూక్ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం క్రికెట్ బెట్టింగ్‌లపై యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నందున బెట్టింగ్ యాప్‌లు ద్వారా భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఇప్పటికే పలు చోట్ల యువకులు ఆన్‌లైన్ జూదం, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలై రోడ్డున పడటమే కాకుండా గత్యంతరం లేకా ఆత్మహత్యలకు చేసుకుంటున్నారన్నారు. బెట్టింగ్ చట్టరీత్యా నేరమని, యువకులు బెట్టింగ్ ఊబిలో పడొద్దని సూచించారు. మండలంలో ప్రత్యేక నిఘా టీంను ఏర్పాటు చేశామని, గ్రామాల్లో ఎక్కడైనా గుంపులుగా ఉండి బెట్టింగులకు పాల్పడుతూ పట్టుబడితే చట్ట పరమైన కేసులు బనాయిస్తామని హెచ్చరించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



పరీక్షలు ముగియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



హెచ్‌ఎంపాడు: చివరి పరీక్ష రాసి ఆనందంతో బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పొన్నలూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలతో పాటు రెండు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 160 మంది విద్యార్థులు, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 116 మంది, విప్పగుంట పరీక్ష కేంద్రంలో 93 మంది మొత్తం 369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పొన్నలూరులో ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని చీఫ్ వెంకట్రావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిసే వరకు కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి ఎస్సై అనూక్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

పామూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు 742 మంది విద్యార్థులకు గాను 738 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు మందాకుమారి, బి.డేవిడ్, అరియారం సురేష్, జె.పోతురాజు, ఎన్.వెంకట్రామయ్య, డీఓలు నాగేంద్రరావు, ఎం రామస్వామి, తిరుపతయ్య, ఎస్‌కే.షరీఫ్, ఖాజామస్తాన్ పర్యవేక్షించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు 348 మంది విద్యార్థులకు గాను 346 మంది హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు చావా శ్రీనివాసులు, అబ్దుల్ సుబాన్, డీఓలు బాషా, ఖాజారంతుల్లా పర్యవేక్షించారు.

మర్రిపూడి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ ఎంవీవీ రంగయ్య తెలిపారు. మొత్తం 296 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్యాంసన్, దశరథరామిరెడ్డి, డిపార్టుమెంటల్ అధికారులుగా వై కృష్ణప్రసాద్, హనుమంతరావు వ్యవహరించారు.

కొండపి: మండలంలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ 2 రామారావు తెలిపారు. మొత్తం 539 మంది హాజరు కావాల్సి ఉండగా 531 మంది హాజరయ్యారు. విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు.

హనుమంతునిపాడు: మండలంలో చివరి రోజు పదో తరగతి పరీక్షలకు ఒకరు గైర్హాజరయ్యారు. 284 మందికి గాను 283 మంది హాజరయ్యారు. చివరి రోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు.



సింగరాయకొండ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

సింగరాయకొండ: మండలంలో మంగళవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ముగియటంతో విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 843 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 169 మంది హాజరయ్యారు. ఎస్సై నాగమల్లీశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు కాశిరెడ్డి కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అర్హులంతా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అర్హులందరికీ ప్రధానంగా డయాలసిస్ పేషంట్లకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం మొబైల్ రేషన్‌వాహనాన్ని తనిఖీ చేశారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై కార్డుదారులకు మోసం చేస్తే సహించేది లేదని చైర్మన్ హెచ్చరించారు. రేషన్ పంపిణీ పై పేదలు ఫిర్యాదు చేస్తే సహించేది లేదన్నారు.